వ్యత్యాసాలు

"నేను మొట్టమొదట చెపితే ఏమన్నావన్నావా? వింటే ఇవ్వాళ నిన్నా రత్తమ్మ ఇంటిమీదకొచ్చి తిట్టగలిగేదా? అయినా, నా మాటమీద నీకు లక్ష్యముంటే కదూ!" అని భర్త రామారావు అంటూంటే సూర్యకాంతం సహించలేక పోయింది.

"ఇదోటి చేతనయింది, ఇంట్లో, పెళ్ళామ్మీద అధికారం చలాయించడమే కాని, ఆ రత్తమ్మ నన్నలా తిడుతూంటే ఆడదాని కంటే అన్యాయంగా తలకాయొంచుకుని ఇంట్లో కూర్చోపోతే, 'నా పెళ్ళాన్నిలా తిడతావా?' అని రత్తమ్మనీ, 'ఏమయ్యా నీ పెళ్ళాం మా యింటిమీద బడి తిడుతూంటే చూస్తూ ఊరుకుంటావా?' అని రత్తమ్మ మొగుణ్ణీ పల్లెత్తుమాట అనగలిగారా? మీకు పౌరుషముంటే, అభిమానముంటే అలాంటి పని చెయ్యండి. కాని లోకువగా ఉన్నానని నన్ను నోట్లో వేసుకోడం" అని చరచరా వంటింట్లోకి వెళ్లిపోయిందా గృహిణీలలామ. అసలు రమణీరమణుల మధ్య ఇంత తీవ్రత కలగటానికి కారణం ఇది.

ఆ పల్లెటూళ్ళో వున్న ఉచ్చజాతుల్లో కాస్త పచ్చగావుండి నాలుగు కుటుంబాలు కలవాళ్లు కాపులు. అంతా వ్యవసాయదారులు. అంతా ఒక ఇంటిపేరు వాళ్ళే.

ఆ వూళ్ళో ఒక్కగా నొక్క బ్రాహ్మణ కొంప రామారావుది. పక్కవూరి స్కూల్లో మేష్టరు. వాళ్ళ వూళ్ళో బోర్డు స్కూలు లేదు. వుంటే యెలాగో—ఏ తిరుపతి వేంకటేశ్వరుడి దయవల్లో — ఉన్న వూళ్ళో మేష్టరీ వేయించుకునేవాడే. ఉన్నవూరు వదలలేక రోజూ నాలుగు మైళ్ళు సైకిలు మీద వెళ్ళి ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఉన్నవూళ్లో ప్రైవేట్లవల్ల గౌరవాదికాలు సంపాదించుకుంటున్నాడు.

భార్యా సూర్యకాంతం చిన్నప్పుడు ఉదువుకున్నమూలాన భారత భాగవతాదులు భాగ్యవంతులయిన కాపులస్త్రీలకి వినిపిస్తుండేది. వాళ్ళతో ఆమెకి బాగా పరిచయం. ఆవిడకి అత్తామామా లేరు, పోరూ లేదు, పనీ లేదు. పొద్దున్నే అంతా వార్చి భర్తకి పెట్టి, మధ్యాహ్నానికి కారేజీలో సద్ది యిస్తూంటూంది. ఇంకొయిన సాయంత్రందాకా రారు.

ఈలోగా ఆవిడ - భక్తిచేతనయితేం, ఊచిపోడానికయితేం - నలుగురు నెచ్చెలుల్ని పిలుచుకువచ్చి, సాయంత్రందాకా కాస్సేపు ఏదో చదవడం, కాస్సేపు ఏ దేవుడిభజనో చేస్తూండడం ఇదీ ఆవిడగారు చేసే కార్యక్రమం. ఇలా కొద్దిరోజులు గడిచాక ఒకనాడు రామారావుగారన్నారు.

"ఇదిగో చూడు! నువ్వు చేసేపని పెద్ద దనను, కాని మంచిదీ కాదు. ఆమాత్రం భగవద్భక్తి పల్లెటూళ్ళోవుండే నీకుందంటే ఆశ్చర్యంలేదు. కాని నువ్వు ప్రారంభించిన పక్కీ మంచిదికాదు. మీ ఈ కార్యక్రమం ఎల్లకాలం సువ్యవస్థితంతో జరగదు. ముందు ఏదో చదవడం వినడం - ఆ తరవాత భజనలు - లోకాభిరామాయణం, దాన్తోటి ఆత్మస్తుతి పరనింద, దానివల్ల వాగ్వాదం - అంతిటితో ఆక్క "శిగపట్ల గోత్రం"దాకా వస్తుంది. ఆపయిన నీయష్టం "చాల్లెద్దురూ! పెద్ద ఏదో ఆడాళ్ళకి స్వతంత్ర ముండాలంటో పత్రికలకి రాస్తారు. కాని ఏదయినా సత్కాల క్షేపానికయినా సరే భార్య మొదలెట్టిందంటే "మడూ" అంటూ బిర్రబిగుసూపోయి చెప్పాస్తారు. మేమేం నీతివిరుద్ధమయిన పని చెయ్యటంలేదు - తెలివిగా ప్రవర్తిస్తే జెబ్బలా ట్లెందుకొస్తాయి." అని రామారావుగారిని మళ్లీ మాటాడకుండా చేసింది.

నిజంగా రామారావుగారన్నట్లుగానే జరిగింది. 'శిగపట్లు' కొంచెం జాగ్రత పడటంవల్ల తప్పిపోయాయి గాని లేకపోతే అంతపనీ జరిగితీరేదే.

కార్తీకమాసం వచ్చింది. "ఏమో! ఏమో! మనకి పెద్ద పనులూ లేవు. ఏమీ లేవు కదా! యే సావిత్రీ చరిత్రో లేకపోతే బ్రహ్మంగారి కాలజ్ఞానమో ఎలాగా చదువుకుంటాముకదా. అలాంటప్పుడు రోజూ తెల్లారగట్టే లేచి, కృత్తికా స్నానంచేసి, దీపాలు పెట్టుకుని, తెల్లారగట్టప్పుడే ఆ చదువుకొనే దేదో చదువుకుంటే కాస్త పుణ్యం ఎక్కువగా వస్తుంది కూడాను. ఏం? అలా చేద్దామా?" అన్నారు సూర్యకాంతంగారు. ఇంకా సంఘంలో ఆవిడగారి మాటకి తిరుగనేది లేనేలేదు. వెధవది హిందూ లాబిల్లు ప్యాసవడమన్నా, కృష్ణా, పెన్నారు ప్రాజెక్టులు కట్టించడమన్నా, రామపాదసాగర్ మాట ఎత్తడమన్నా, బ్లాకుమార్కెట్ పోవడమన్నా, అంటే జరక్కపోవచ్చు గాని యీ సంఘంలో మాత్రం సూర్యకాంతంగారి ప్లాను నెగ్గకపోవడం, అది అక్షరాలా జరక్కపోవడం అనేది లేదు. ఇంకంతసై అని ఆచరించడం మొదలెట్టారని కూడా వేరే చెప్పటాని కవసరంలేదు. మర్నాడు ప్రొద్దున్నే కావిళ్ళతోటి నీళ్లు తేవడానికి వెళ్ళిన మగాళ్లకందరికీ చెప్పక్కర్లేకుండానే, పొదంచాలమీది ముగ్గులూ, చెరువులో అరటి గొప్పలూ, పూలూ, రాత్రిళ్లు భక్తురాళ్లంతా స్నానాలు చేశారని తెలిసిపోతూంది — ఊళ్లో ఆవు నేయి గిద్ద అర్ధ రూపాయయి కూచుంది. అదివఱకు ఆరణాలుగానే ఉండేదల్లా మహా మంగామూ తోటి ఆ అబలా మణులు, తెల్లారగట్ట లేవటం హరికేన్ లాంతర్లూ, ఆరేసినబట్టలుసద్దిన సజ్జలూ, పుచ్చుకొని, ఎంకొయమ్మొదినా, సూరేకాంతంగారూ! లెండి, రండి" అని కేకేసుకుంటూ నడవడం ఆ తరువాత సూర్యకాంతంగారి యింటిముందు తులిసిమ్మ చుట్టూరా కూచుని ఏదో సూరేకాంతమ్మగారు చదువుతూంటే వింటం జరుగుతోంది.

అందులో పకావిడగారు ఓసారి డొచ్చి నట్టేవచ్చి మన్నాడు రాటం మానేసింది. "ఏమో! స్థానానికి రావటం మానేశావూ?"

శ్రీ యేలూరిపాటి అనంతరామయ్య

అని సూర్యకాంతంగారు నీలాటి రేవులో నిలేశారు. ఆవిడ "అప్పయ్యగారూ! నాకు రావాలనేవుంది. గానండి మీ మరిదిగారొప్పుకోలేదండీ!" అంది. "ఏం!" నా వొళ్లసలే మంచిదికాదంటండి, రోజూ స్నానాలూ, ఉపోసాలూ, చేస్తే, రోగమొస్తుందిటండి, అగీకాకుండా ... అదే మిటోనమ్మా.. జ్ఞాపకం రాటంలేదూ!... కాని ఏదో పద్యంకూడా చదివారు. ఊఁ... పూర్తిగా జ్ఞాపకం రావటంలేదు, ఆఁ కొంచెం జ్ఞాపకం వచ్చింది - "ముసురాడువారు కూడిన, సుగుణాకర! పగటిపూట - చుక్కలు పొడుచుచు" అని చదివి, "అలాంటప్పుడు మీరాంటి లోకజ్ఞానంలేనివాళ్ళంతా ఓచోట పోగైతే ఇక జట్టీలకి పాస్పుకోర్కర్లలేరు. గోజుకోమనిషిమీదికోకేసు వొస్తూంటుంది" అన్నారు. "అలా యెందుకవుతుందండి వెడతా"నంటే, "ఓ యబ్బో! మీ పాత్రెవరెరగరు, మొన్న పండక్కి మీ నాన్నగారింటికి వెళ్లేటప్పుడేం జరిగింది. మొగాళ్లపెట్టెలో కెక్కనీ తోపిడిగావుంటుందని ఆడాళ్ళపెట్టెలో ఎక్కనీ దిగొచ్చేప్పటికి జుట్టుజుట్టూ పట్టుకోడానికి ఓ ఆవిడా, నువ్వూ, సిద్ధమవలా? వెళ్లొ"ద్దన్నారు.

"వాళ్ళంటే ఎరగనాళ్లు కనకా, ఆవిడ నామీద తనఏనుక్కొలెయ్యటం మొదలెట్టి "చస్తున్నానమ్మా! మాయ గోల, మాయ కాళ్ళూ", అని నేనంటే ఆవిడ నన్ను తిట్టటం మొదలెట్టింది కనకా, దెబ్బలాటొచ్చింది. కాని అంతా ఎరిగున్నాళ్ళం, ఇరుగుపొరుగు వాళ్ళం, మాకు దెబ్బలాటెందు కొస్తుంది. వెడతా" అన్నాను, దానితో ఆయన మండి "వెళ్లు, నా యిష్టమేముందల్లా టప్పుడు. నా మాట నీకు లెక్కెంటి, బోడిమాట. కాని యీ మాటలుమాత్రం మరిచిపోకు. యిదివర కిలాగనే చెపితే వినకే జబ్బుపడి రెండుమాట్లు రెండు రెళ్లు నాలుగు వందలు తగలేయించావు. యీసారి రోగం వచ్చిందని మాలిగావంటే, కాసుమాత్రైనా తేను. మాటి మాటికీ రోగాలకంటూ వందలు తగలెయ్యటానికి నేనేం మీఅన్నయ్యలాలక్షాధికార్నికాను. తరవాత నీ యిష్టం" అన్నారు— "ఇక నేనేం చెయ్యాను. మీరే చెప్పండి," అందావిడ. "అదేమిటో అలాగంటావూ! మన కొమాత్రం సాతంత్రం వుండక్కర్లా, అసలు సాతంత్రమంటూ మన కేముందో! మొన్నామధ్య మా ఆడబడుచుగారూ రాశారు. అక్కడ ఆడాళ్లు మనలాగ పూజలు చెయ్యటం లేదు. పురాణాలు చదవటం లేదు. కానీ ఏమిటో! మీటింగుల్లు, పత్రికల్లు. ఒకటేమిటి? కళ్ళకీ, కాళ్ళకీ జోళ్లెట్టుకుని, ఎంచక్కా ఎలా వుంటారనుకున్నావూ! మనకి అలాంటి యోగం లేదు సరికదా! కొంచెం కృష్ణా, రామా, అనికూడా అనికోనీరేంటి? మన మొగాళ్లు; మొదట్లో మా ఆయనా అలాగే అన్నారు. మరి అయితేయేం నే రావటంలా? స్నానాలకి; పైగా పురాణం, భజన్లూ మా యింట్లోనే జరుగుతున్నాయి కూడాను. ఎవరన్నా నవ్విపోతారు గాని— ఇవ్వాళ ఎల్లాగోలాగ మీ ఆయనతో సమాధానపడి రేపణ్ణుంచి రా! అయ్యో యెసరొట్టొచ్చా మాయదారిది, మాటాడుతూ మరిచిపోయాను" అని సూరేకాంతంగారు వెళ్లారు. కాని మళ్లీ ఆ పెద్దమనిషి భర్తమాటమీది గౌరవమే అనండి మళ్ళీ భజనలకీ స్నానలకీ రాలేదు - ఆవిణ్ణి ఆ సభ్యురాండ్రు మాత్రం తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యానం ఎలాగయితేం ఆ పెద్దమనిషి చెవిలోపడింది సూరేకాంతంగార్ని ఎలా పరాభవించాలా? అని ప్లాన్లు వేస్తూంది.

కార్తీక సోమవారం వచ్చింది, ఆదివారంనాడు అంతా కలిసి స్నానాలు చేస్తూండగా "ఏమో! రేపు ఏకాశీ సోమవారం కలిసొచ్చాయి. ఎంతో పర్వమయిన రోజు రేపు. రేపుకూడా యిక్కడే స్నానం చేసేదానికంటే రాజమండ్రి కోటిలింగాల క్షేత్రంలో స్నానంచేసి, - కార్తీక పురాణం చెపుతార్ట. అక్కడ-వినొచ్చి, రేపల్లా ఉపవాసంఉండి ద్వాదశినాడు మధ్యాహ్నం భోంచేసి, రాత్రి క్షీరాబ్ధిశయన వ్రతం చేసుకుందాం" అని సూరేకాంతంగా రన్నారు. అంతా 'సరే' అన్నారు.

అప్పుడంతా ఆదివారం సాయంత్రానికే రాజమండ్రివెళ్లి కోటిలింగాలసత్రంలో ఆ రాత్రి కాలక్షేపంచేసి, పురాణం విని, ఉదయం ఒంగోలు కోచీలో బయలుదేరి యింటికి చేరారు.

ఏకాశి ఉపవాసంతోగడిపి, చీకటడ్డాక యీరాత్రి జాగారం చేద్దామనుకొని, సూరేకాంతంగా రింటికొచ్చి బరకం పరుచుకొచ్చుని సూరేకాంతంగారు చదువుతూండగా ఏదో, అంతా ఆహా! అనటం మొదలెట్టారు. ఏదో సందర్భంలో పారిజాతాపహరణం మాటొచ్చింది. సూరమ్మగారు చిన్నప్పుడు పారిజాతాపహరణం వాళ్ళ నాన్నగారి దగ్గిర చదువుకున్నారు. కనుక నోటికి వచ్చిన పద్యాలు జోడిస్తూ కథ చెపుతూ "జలజాతాసన వాసవాదిసుర పూజాభాజనంబై తనర్పులతాంతాయుధు గన్నతండ్రి శిరమచ్చో వామపాదంబునం, దొలగంద్రోచె లతాంగి, అట్లయగు నాథుల్నేరముల్సేయపే, రలుకం జెందిన యట్టి కాంతిలు చితవ్యాపారము ల్నేర్తురే" అన్న పద్యం చదివి భావం చెపుతూ, ఇదివఱకటి పెద్దమనిషైన వెంకాయమ్మ మొగుడు "ముసురాడువారు గూడిన, సుగుణాకర! పగటిపూట చుక్కలు పొడుచుచు" అని వెంకాయమ్మ దగ్గిరైతేమాత్రం యెందుకనాలీ అనే ఉద్రేకంతోటి "దేవుణ్ణి అంతమాటనగూడదు, కాని మా బాగా తన్నింది సత్యభామ" అందా భామామణి. "అలా తన్నకపోతే పారిజాతం తెచ్చేవాడా?" అందింకో రమామణి. "దెబ్బకి దెయ్యం

జడుస్తుందంటండీ" అందింకో లలనామణి. అంతా యిలా గంటూన్నందుకు బాధ పడుతూ. "నిజంగా సత్యభామ అలా తన్నిందంటారాండి, మన మురళీకృష్ణుణ్ని" అందో భక్తురాలు. "ఏమ్మా! అందుకు సందేహం? ఈ కాలంలో వున్న ఆ వీధి రత్తమ్మగారేం చేసింది," అంది. "ఏమిటండోయ్ మేం వినలేదు" అన్నారొకరు. "ఆమధ్య రత్తమ్మగారి భర్త అర్ధరాత్రి వేళ నిద్దరపొద్దులో వచ్చి "చిటపట చినుకులు దుప్పటి తడిసెను తెలుపు తీయవే భామా" అన్నట్టు కేకేశారు. ఆ తరవాత రత్తమ్మగారు తలుపుతీసి "వాటమైన బంగారపు దుప్పటి కొటుకమరకేమోయీ కృష్ణ! గోవిందా! నీ చక్కనిగోరులు, కొనలు మంగ నేమోయీ!" అని ప్రశ్నలు వెయ్యడం మొదలెట్టింది. ఆయన వెంటనే వైభవ పౌరుషం చూపిందటానికి ప్రయత్నిస్తే ఆవిడగారు "మూలనున్న చీపురుగట్టం దటాలున నెత్తి ధనధనాత్కారమ్ముగా" వాయించటం నే స్వయంగా చూశాను." అంది పురాణధోరణిలో చమత్కరిస్తూ. అని "సత్యభామ యేంచేసిందో ఆ పురాణ దంపతుల రహస్యాలు తలిస్తే మనకి పాపం వస్తుంది. కాని మన ఆ రత్తమ్మగారు మాత్రం యీపని చేసితీరింది" అన్నారు సభ్యురాండ్రు హర్షధ్వనులు చేశారు. జాగరణ యిలా ముగిసింది.

మర్నాడు ఆ సమాజంలోని నారదుని ప్రియశిష్యురాలయిన ఒక భామామణి ఈ విషయం వెంకాయమ్మగారితో చెప్పింది. అసలే అవకాశాని కాక్కుకుక్కుచున్న వెంకాయమ్మగారు రత్తమ్మగారింటికి నిప్పుకెళ్లారు, వెళ్ళి "చూశావా? రత్తమ్మొదినా! రాత్రేం జరిగిందో, అందుకనే నేనా సూరేకాంతంగారి యింటికెల్లం మానేశాను అంది.

"ఏం టొదినా? ఏం జరిగింది,"

"ఏం చెప్పనూ! చెప్పాలంటే నీ కెంత కోపమొస్తుందో తల్చుకుంటే నా వొళ్లు మండుతోంది."

"అస లేంటో చెపుదూ!"

"ఏముందీ, మా అన్నయ్య అర్ధరాత్రేళ యెవరితోటో మాటాడాడట, నువ్వు చూశావట, ఇంటికొచ్చాక యిలాగైతే ఎలాగన్నావట, మా అన్నయ్య నీ కెందుకని నాలుగు తన్నేడట, నువ్వు చీపురుకట్టుచ్చుకున్నావట. ఇద్దరూ కొట్టుకుంటూంటే ఆవిడ చూసిందట. విన్నావా!" ఆ సూరేకాంతం ఎలాంటిదో, ఇలాటి మాట నలుగురిలో అంటుందా? అక్కణ్ణుంచి అంతా నవ్వులూ గుసగుసలూ ఎన్నో యిందాలాడిపోసు కున్నారంట. యిన లేక లేచొచ్చి ఒకావిడ నాతోటంది. సాటిమనిషినిలాంటి మాలంటుందా? నీ మీద యిష్టంమూలాన అగలేక నీ తోటి చెప్పా. ఆవిడ కాపొగ రేంటి చెప్పు."

ఆ కలహం వృక్షానికి చిలవలు పలవలు మొలిచాయి. "ఇప్పుడే కనుక్కుంటానుండు" అంది రత్తమ్మగారు సూరేకారం పాలు ఎక్కువయి. ఆ త్రిపురాసురమర్దనీ ఆకారాన్ని చూసి లోలోపల సంతోషిస్తూ "నే నన్నానసేవు సుమీ. మా వారు మంచారు కారు" అంది వెంకాయమ్మ. "నేనంత తెలివి తక్కువదాన్నా?"— "అయితే వెళ్ళొస్తా వొదినా! కావల్సిందానవు కనుక నువ్వెడంచేత్తో పెడితే నే కుడిచేత్తో తింటా గనక, నీకూ నాకూ ఎరమరిక లేదు కనక చెప్పాను. నా ఊసు తేకు సుమీ" అని నిప్పు తీసుకోకుండానే వెళ్లింది.

వెంటనే రత్తమ్మగారు "పవమాన మానస తిరస్కారత్వరాహంకృతిక" సూరేకాంతంగా రింటిమీద పడింది. సూరేకాంతం యివతలకొచ్చిందో లేదో భారతం విప్పింది. "అమాసనాడట్టేటావా? పున్నం నాడు బూరెట్టావా? నువ్వన్న మాట్లన్నీ నే పడతా ననుకున్నావా? యీ రత్తమ్మంటే యెవ రనుకున్నావ్ — నువ్వు నీతోటి తిరిగే కుక్కలూ, మొరిగే మొరుగులు నా కినపడ వనుకున్నావా? నా మొగుడూ నేనూ కొట్టుకోటం నువ్వు చూశావా? మా కేకలు నువ్విన్నావా? ఇలాంటి పనికిమాల్న పేలాపన ఇంకోసారి పేలు; నీ పరువు ఎంతుందో నే చూస్తాను" అని ఇంకా ఏమన్నా ఆవిడ సమాధానం చెపుతుందేమో దానికి సమాధానం చెబుదామనైతే యేం, కాస్త రెస్టు తీసుకుందామనయితే యేం ఆగింది. కాని ఆవిడ సమాధానం చెప్పే స్థితిలో వుంటేగా, "చలి పిడుగులాగా అమాంతం మీదపడి వాగ్వర్షం కురిపిస్తూంటేనూ, మాటాడితే ముష్టియుద్ధానికి ధీకోడానికి సిద్ధంగావున్న ఆవిడ "పోజు" చూస్తేనూ నోటంట మాట రాలేదు - కాని రత్తమ్మగా రింతటితో నిరాశపడిపోయే రకంలో చేరదలుచుకోలేదు. "నువ్వూ, నీ మొగుడూ దెబ్బలాడారేమో మీ అమ్మ, నీ చెల్లెళ్లు, నీ అత్త, నీ అత్తత్త, నీ అమ్మమ్మ కొట్టారేమో మొగుళ్లని, దేవుళ్లనీ స్నానాలనీ ముతాల్లాగా పోగయి ఊళ్లో వోళ్ల ఊసెందుకంట; జాగర్త, యేమనుకున్నారో, అని" తాటం కాచలనంబుతో, భుజనటద్దమ్మిల్ల బంధంబుతో, అనేసి విసవిస వెళ్లింది.

ఇంట్లో కొచ్చారు సూర్యకాంతంగారు, వెంటనే తన ఫస్టువార్నింగ్ విషయం రామారావుగా రెత్తితే పాపం ఆ 'మానవతి' యేంచేస్తుంది చెప్పండి? దీంతోటి వాళ్లకి పొటుకొచ్చింది భర్తకి సమాధానం చెప్పి ఏకాళి ఉపవాసంతోటి నీరసంగా ఉండేమో గోడకి చార్లబడి పొయ్యి మంటెడుతోంది సూరేకాంతం. రామారావుగారు మాత్రం సూరేకాంతానికి వినబడేలాగ పక్క గదిలోంచి "నే నెప్పుడు స్నానాలు చెయ్యొద్దనను, పూజలు చెయ్యొద్దనను, నే నేం నాస్తికుణ్ని కాను. కాని భక్తి పేరు చెప్పి వైభవపనులు చెయొద్దంటాను. ఎవరిష్టం వారిదికదా అని, పరువుకి దేహానికి అనారోగ్యకరమైనవి చెయ్యొద్దంటాను. పుణ్యం సంపాయిస్తామని తయారయి, సమావేశమయి ఇతరుల దోపాలు ప్రసారిస్తే ఉన్న పుణ్యం గంగాయాత్ర చేస్తూందంటాను," అని అంటూ వంటగదిలోకి వెళ్లారు. ★

నపుంసకతైలం

అంగ నరములు బలహీనత పొంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 40 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ.10/కిలార్డ్ వి.పి.యా 1-0-0.

ఆర్డరుతో రు 1/- పంపవలెను.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్

మలక పేట బిల్డింగ్స్,

హైద్రాబాద్, దక్కన్.

శతమూలికాది లేహ్యము

లోహాభ్రకసింధూరముతోసహా సేవించిన సమస్తసుఖవ్యాధులు, ఎఱుపు తెలుపు మచ్చలు, బగ్గెలు నపుంసకత్వము నివారించి వీర్యవృద్ధి, బలము, నరముల పటుత్వము కలుగజేయును స్త్రీలబుతుశూలలు, కుసుమరోగములు, నష్టసంతానము నివారించి మంచిసంతానము కలుగజేయును. 40 దినములకు మందు రు 18.

శ్రీ భుజంగరాజ్యౌషధశాల

తాళ్ళరేవు, తూర్పు గోదావరి జిల్లా.